క్లుప్తంగా

ఇప్పలపాడులో వై ఏపీ నీడ్స్ జగన్



వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేసిన దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని ఇప్పలపాడులో వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో సుమారు రూ. 16,34,38,662 తో అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. అలాగే పార్టీ జెండాను ఎగుర వేసి జగన్ నివాదాలు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎం.శ్రీహరి, పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీ తెల్లం రమణ, సర్పంచ్‌లు మడకం రామలక్ష్మి, కుంజా వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు తెల్లం చిన్నారావు, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు దాత వాసా రామకృష్ణారావు కుటుంబసభ్యులు మంగళవారం విరాళం అందించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణకు రూ.10,116 విరాళాన్ని రామకృష్ణారావు అందజేశారు. దాత కుటుంబసభ్యులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదం ఇచ్చి, అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించారు.

నందిపై ఊరేగిన శివయ్య



క్షేత్ర పురవీధుల్లో నంది వాహనంపై ఊరేగుతున్న గంగా, పార్వతీ సమేత శివయ్య

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారు మంగళవారం రాత్రి నంది వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం ఆలయంలో అర్చకులు, పండితులు శివదేవునికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని నేత్రపర్వంగా జరిపారు. రాత్రి గంగా, పార్వతీ సమేత శివదేవుని గ్రామోత్సవాన్ని నంది వాహనంపై క్షేత్ర పురవీదుల్లో అట్టహాసంగా జరిపారు. ప్రతి ఇంటి ముంగిట భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు.

జన్‌భాగీదారీ



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం రూరల్: ఈనెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ప్రారంభ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని పంగిడిగూడెంలో జన్‌భాగీదారీ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో నడుస్తామంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీలతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: వేంపాడులో ప్రధాన రహదారి పక్కనున్న ఆక్రమణలను అధికారులు మంగళవారం తొలగించారు. డ్రెయినేజీల నిర్మాణం నిమిత్తం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఈ పనులను చేపట్టారు. అయితే స్థానికులు కొందరు ఈ పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించగా తహసీల్దార్ పి.సతీష్, భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ దగ్గరుండి జేసీబీల సహాయంతో ఆక్రమణలను తొలగింపజేశారు.

న్యాయం చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో వివిధ విద్యుత్ సంస్థల్లో జూనియర్ ఇంజినీర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శేషారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ హాలులో ఆ సంఘ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు ఎ.ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప యాత్రకు ఐదేళ్లు



కుక్కునూరు: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పోలవరం: సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బుట్టాయగూడెం: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సంబరాలు చేసుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కుక్కునూరు: జగనన్న చేసిన ప్రజాసంకల్ప పాదయాత్ర ఆంధ్ర రాష్ట్ర రాజకీయాలలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అంశమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు పేర్కొన్నారు. జగనన్న ప్రజాసంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్లు నడిచి సుమారు రెండు కోట్ల మంది ప్రజలను కలిసి వారి కష్టాలను తెలుసుకున్న జగనన్న అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. ఈ సుదీర్ఘ పాదయాత్రలో శరీరానికి ఎన్నిగాయాలైనా పట్టించుకోకుండా ప్రజల కోసం ఆలోచించిన ఏకైక వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అటువంటి మహోన్నత నాయకుడిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావు వినోద్, రాయి రవి, ఐతా కోటేశ్వరరావు, ఉట్కూరి రాజారావు, కుచ్చర్లపాటి రంగరాజు, కుచ్చర్లపాటి చిన్ననరసింహరాజు, మన్యం భద్రయ్య, అమరవరపు శ్రీనివాసరావు, మొకరాల హరీష్, వేల్పుల శ్రీనివాస్, సూర్ల రాము, మల్లేల చంటినాయుడు, కుక్కునూరు ప్రసాద్, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో...

పోలవరం రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు సందడి చేశారు. పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ సుంకర వెంకట రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాసి ధనలక్ష్మి, పట్టిసం సొసైటీ అధ్యక్షుడు పాదం రాజబాబు, ఏఎంసీ డైరెక్టర్ దాకే మంగాయమ్మ, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే చాన్, వైఎస్సార్ సీపీ నాయకులు వెలగంశెట్టి సూర్యచంద్రం, సొబ్బన మోహన్, అక్కాబత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ కాంతులు

బుట్టాయగూడెం: ప్రజాసంకల్ప యాత్రలో అన్ని వర్గాల వారిని పలకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నవరత్న పథకాలతో పేద, మధ్య తరగతి వర్గాలకు అండగా నిలిచారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి అన్నారు. రాష్ట్రంలోని పేదల జీవితాలు మెరుగుపరిచేలా విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టడానికి తోడ్పడిన ప్రజాసంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం స్థానిక అరుంధతీ కాలనీ వద్ద ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే కేక్ కట్ చేసి అందరికీ పంచారు. అనంతరం వారు మాట్లాడుతూ 134 నియోజక వర్గాల్లో 2516 గ్రామాల్లో 341 రోజులపాటు 3648 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన విజయసంకల్ప ధీరుడు జగనన్న అని అన్నారు. నాటి పాదయాత్రలో ప్రతి ఒక్కరి సమస్యలను తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టాక అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాయని అన్నారు. జగనన్న పాలనలో అన్ని వర్గాలు, కులాల వారికి మంచి జరిగిందని అన్నారు. ప్రభుత్వ పథకాలు పేదలకు మరింత ఉపయోగపడాలంటే రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీ తెల్లం రమణ, సర్పంచ్‌లు మడకం రామలక్ష్మి, బన్నే బుచ్చిరాజు, సరియం చల్లయ్య, నాయకులు తెల్లం చిన్నారావు, తెల్లం దేవరాజు, దోరేపల్లి త్రిమూర్తులు, సోదెం సుధాకర్, గాడి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణకు సహకరించాలి

టి.నరసాపురం: ఫైలేరియా నివారణకు ప్రజలందరూ సహకరించాలని మండల వైద్యాధికారిణి జె.కల్పనా రాణి కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా మలేరియా అధికారి వారి ఆదేశాల మేరకు టి నరసాపురం సచివాలయం–2 పరిధిలో మైక్రోఫైలేరియా సర్వేలేన్స్ నైట్ రక్త నమూనాల సేకరణ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నివాసిత ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ ఎ.లలితకుమారి, హెచ్‌వీ మావుళ్ళమ్మ, ఏఎన్ఎం వై.వెంకటలక్ష్మి, ఆశాలు సృజన, బుజ్జి, లక్ష్మి, మంగ తదితరులు పాల్గొన్నారు.

310 మందికి వైద్య సేవలు

టి.నరసాపురం: మండలంలోని మక్కినవారిగూడెంలో జగనన్న సురక్ష ఫేస్–2 వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. టి.నరసాపురం పీహెచ్‌సీ వైద్యులు ఫణీంద్రబాబుతో పాటు మరో ముగ్గురు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 310 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ కళ్యాణి, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికే పీఎం జన్‌మన్ యోజన

ఐటీడీఏ పీఓ సూర్యతేజ



బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామం రామనర్సాపురంలో గిరిజనులను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్ యోజన) పథకం అమలు చేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు. మండలంలోని మారుమూల గ్రామమైన రామనర్సాపురం (గుమ్ములూరు)ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని గృహాలకు ఉచిత మీటర్ల ఏర్పాటు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీఎం జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీల్లోని పక్కా ఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా ఆరోగ్య పరిరక్షణ, నిరంతరం నీటి సౌకర్యం, ప్రతి ఇంటికీ విద్యుత్, అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, మల్టీపర్పస్ కేంద్రాలు, సోలార్ విద్యుత్ దీపాలు వంటి సౌకర్యాల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. బుట్టాయగూడెం మండలంలోని అటవీప్రాంతంలోని శివారు గ్రామమైన రామనర్సాపురంలో సుమారు 200 ఇళ్లు ఉన్నాయని వీటిలో 57 ఇళ్లకు పీఎం జన్‌మన్ పథకంలో ఉచితంగా విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం గ్రామంలోని గిరిజనులను పీఓ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏపీ ఈపీడీసీఎల్ ఎలక్ట్రికల్ ఈఈ పి.రాధాకృష్ణ మాట్లాడుతూ కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో గల 92 గిరిజన గ్రామాల్లో సుమారు 1176 గృహాలు పీఎం జన్మాన్ పథకంలో ఉచిత మీటర్లు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ బుట్టాయగూడెం మండలంలో 43, వేలేరుపాడులో 15, పోలవరంలో 27 గృహాలకు విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే మిగిలిన గృహాలకు సంక్రాంతి పండుగ అనంతరం విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఆయన అన్నారు. వేలేరుపాడు మండలం పేరంటాలపల్లి, కాకిస్నూరు, పోలవరం మండలం చీమలూరు గ్రామాలకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కరెంట్ సమస్యలకు సంబంధించి 13 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని అన్నారు. అలాగే 29 గ్రామాలకు లైన్‌లు వేయాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏడీ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



రాజవరం సచివాలయం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పింఛన్ లబ్ధిదారులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచడంపై అవ్వ, తాతలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

– కొయ్యలగూడెం

నేటినుంచి మండలస్థాయి 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు

కొయ్యలగూడెం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం నుంచి మండల స్థాయి పోటీలు ప్రారంభమవుతున్నట్లు ఎంపీడీవో ఆర్‌బీబీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం బాలుర హైస్కూల్లో కొనసాగుతున్న గ్రామ స్థాయి ఆడదాం ఆంధ్ర గ్రామస్థాయి ముగింపు పోటీలను తహసీల్దార్ పి.నాగమణితో కలిసి ఆమె పరిశీలించారు. మండల స్థాయికి సంబంధించి నాలుగు గ్రౌండ్స్‌లలో ఈనెల 20వ తేదీ వరకు ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. పరింపూడి బాయ్స్ హైస్కూల్లో క్రికెట్, గరల్స్ హైస్కూల్‌లో బ్యాడ్మింటన్, కన్నాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ వాలీబాల్, కబడ్డీ, రాజవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కోకో పోటీలు ఉదయం 7.30 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు.



కొయ్యలగూడెం బాయ్స్ హైస్కూల్‌లో బ్యాడ్మింటన్ పోటీలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

నేడు మండల స్థాయి ఆటల పోటీలు

జంగారెడ్డిగూడెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం నుంచి మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ భవానీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో నిర్వహించే ఈ పోటీలను ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభిస్తారని తెలిపారు.

సంక్రాంతి సంబరాలు

కొయ్యలగూడెం: సంక్రాంతి పండుగ నేపథ్యంలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పలురకాలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలు ముగ్గుల పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రేపల్లెవాడ గ్రామంలో జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ మట్టా వనజాలక్ష్మి విజేతలకు బహుమతులు అందజేశారు.



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న దృశ్యం

మహాసభల కరపత్రం విడుదల

జంగారెడ్డిగూడెం: అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర 10వ మహాసభ ఫిబ్రవరి 3, 4 తేదీల్లో గుంటూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయకులు తలారి ప్రకాష్ తెలిపారు. మంగళవారం మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. కలింపూడి సుందర్రావు, సముద్రాల బాల సుందరం, బోడ ఏసుపాదం, సాలి రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

జంగారెడ్డిగూడెం మున్సిపల్ 2వ సచివాలయం పరిధిలోని చంద్రశేఖర ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.భవానీప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ



ఏరువ జానకికి వైఎస్సార్ బీమా చెక్కును అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి: మండలంలోని రేచర్ల గ్రామానికి చెందిన ఏరువ జానకికి రూ.లక్ష వైఎస్సార్ బీమా చెక్కును సర్పంచ్ కొండుబోయిన శివరామకృష్ణ మంగళవారం అందజేశారు. జానకి భర్త నాలుగు నెలల క్రితం ఉపాధిహామీ పనికి వెళ్లి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరుపున సహాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నరుకుళ్ళ ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు గుత్తా మాధవరావు, మాగంటి లక్ష్మణ్‌దాస్, చింతా గోపాలకృష్ణ, పెనుగొండ శివరామకృష్ణ, జరబలా రాము, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూద క్రీడలు ఆడితే కఠిన చర్యలు

జంగారెడ్డిగూడెం: సంక్రాంతి నేపథ్యంలో కోడి పందేలు, జూదం, గుండాట తదితర జూద క్రీడలు ఆడడంపై హైకోర్టు నిషేధ అజ్ఞలు విధించినట్లు జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య, డీఎస్పీ ధనుంజయుడు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సంక్రాంతి పండుగను బంధువులు, కుటుంబసభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. కోడిపందేలు, జూదం, గుండాట తదితర జూదక్రీడలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా జూదక్రీడలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు గమనిస్తే ఆ సమాచారాన్ని సంబంధిత తహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, గ్రామ రెవెన్యూ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శిలలో ఎవరికైనా వెంటనే తెలియజేయాలని కోరారు. సమాచారం తెలియజేసినవారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ బి.విద్య, డీఎల్‌డీవో ఎం.రాజు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. సంక్రాంతి నేపథ్యంలో జూద క్రీడల నిషేధంపై మంగళవారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కమిషనర్ భవానీ ప్రసాద్‌తో పాటు, తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీవో విజయ్‌ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వులు ఎవరైనా ఉల్లంఘించి జూదక్రీడలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న సమావేశం

ద్వారకాతిరుమల: సంక్రాంతి పండుగ పేరుతో జూద క్రీడలు ఆడేవారిపై కఠిన చర్యలు చేపడతామని, ప్రజలు సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని తహసీల్దార్ పి.సతీష్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జూద క్రీడలు ఆడేవారు, కోడి పందేలు వేసేవారితో పాటు వాటిని చూడడానికి వచ్చేవారు, పందేల నిర్వహణకు స్థలాలను ఇచ్చే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతిరావు, డిప్యూటీ తహసీల్దార్ బి.దుర్గా మహాలక్ష్మి, రైటర్ దుర్గారావు తదితరులున్నారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత



విజయవాడ ఆసుపత్రిలో దివ్యాంగునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్వాతి

చింతలపూడి: ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారులకు అందజేయాల్సిన పింఛన్ మొత్తాన్ని అందించేందుకు వలంటీర్లు కనబరుస్తున్న సేవా నిరతిని పలువురు ప్రశంసిస్తున్నారు. చింతలపూడి మండలం వెలగలపల్లికి చెందిన దివ్యాంగుడు గొల్లపల్లి రాంబాబు పింఛన్ లబ్ధిదారు. ప్రస్తుతం అనారోగ్యంతో విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వలంటీర్ బొక్కినాల స్వాతి విజయవాడ వెళ్లి ఆస్పత్రిలో ఉన్న రాంబాబుకు ఈనెల పింఛన్ మొత్తాన్ని మంగళవారం అందించింది. పింఛన్ మీదే ఆధారపడి బతుకుతున్న దివ్యాంగునికి దూరాభారమైనా వెళ్లి పింఛన్ అందజేసినందుకు గ్రామస్తులు, అధికారులు వలంటీర్ స్వాతిని అభినందించారు.

ఫాతిమా బేగంకు నివాళి



ఫాతిమా బేగం షేక్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మొదటి భారత మహిళా టీచర్ ఫాతిమా భేగం షేక్ 193వ జయంతిని నిర్వహించారు. స్థానిక ప్రజా వైద్యశాలలో జేవీడీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫాతిమా బేగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్త్రీ విద్యకై ఎన్నో అవమానాలు భరించి అణగారిన వర్గాల అభివృద్ధికి విశేష కృషిచేసిన ధీరవనిత ఫాతిమా భేగం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాకుబ్, ఎంవీ శ్యాంబాబు, షేక్ నాజీర్, ఎండీ శాలిమా, అబ్దుల్ సాహిద్, భూపతి రామారావు, కోట సుబ్బారావు, ఎం.సత్యనారాయణ, నాగు, కలపాల రాజ్‌కుమార్, శ్రీరాముల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి కత్తులు కలిగిన వ్యక్తి అరెస్ట్



కోడి కత్తులతో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

కొయ్యలగూడెం: కోడి కత్తులను కలిగిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ మంగళవారం పేర్కొన్నారు. కన్నాయిగూడెం గ్రామానికి చెందిన గంగాధరుని పిచ్చయ్యాచారి వద్ద కోడి కత్తులు ఉన్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా అతడిని పట్టుకున్నామని, నిందితుని వద్ద 102 కత్తులు, కత్తులను సానపెట్టే రెండు రోలర్లును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అతడిపై బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1.01 లక్షల విరాళం



దాత వెంకటేశ్వరరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు మంగళవారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. అత్తిలికి చెందిన చెనుమోలు వెంకటేశ్వరరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.